ఇందిరమ్మ ఇళ్ల సర్వే వెంటనే పూర్తి చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్, డిసెంబర్ 30 : జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులతో మాట్లాడారు. సర్వేలో సేకరించిన అన్ని వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ప్రజాపాలన గ్రామ సభల్లో 2,10,677 దరఖాస్తులు రాగా, వాటి పరిశీలనకు 623 మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 80.77 శాతం సర్వే పూర్తయిందని, గ్రామాల్లో 87.04 శాతం, మున్సిపాలిటీ జమ్మికుంటలో 96.94, హుజూరాబాద్‌లో 90.75, చొప్పదండిలో 84.01, కొత్తపల్లిలో 72.15, కరీంనగర్ నగరపాలక సంస్థలో 55.26శాతం సర్వే పూర్తయినట్లు చెప్పారు. ఈనెలాఖరులోగా వందశాతం సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి సందేహాలున్నా తమ పరిధిలోని అధికారులను సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: అదనపు కలెక్టర్

కలెక్టరేట్, డిసెంబర్ 30: గ్రామాలు, మండల కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ ఆదేశించారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్‌శాఖ, జడ్పీ అభివృద్ధి పనులపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మార్చి నెల సమీపిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగించాలన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయ భవనాల మరమ్మతులు సత్వరం చేయించాలని సూచించారు. రానున్న వేసవిలో మంచినీటి సరఫరా కోసం అవసరమైన చర్యలు ఇప్పటినుంచే చేపట్టాలన్నారు. ట్యాంకులు, లీకేజీలు, మరమ్మతు పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

'బీసీ సమర శంఖారావం విజయవంతం చేయాలి'

తెలంగాణచౌక్, డిసెంబర్ 30: బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలనే డిమాండ్‌తో జనవరి 8న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో నిర్వహించతలపెట్టిన బీసీ సమర శంఖారావాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం సమర శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ బీసీ నాయకులు రంగు సంపత్ గౌడ్, నాగుల కనకయ్య గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

శాసనమండలి చైర్మన్ దృష్టికి ఎస్ఎస్ప ఉద్యోగుల సమస్యలు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 30 : సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని నల్లగొండ జిల్లాలో కలిసి కోరినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు మల్కల కుమార్ తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ కట్టుబడి ఉన్నదన్నారు. సమస్యల పరిష్కారానికి మహాసభల్లో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి జావేద్ తెలిపారు. మండలి చైర్మన్‌ను కలిసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు భూపేందర్ కౌర్, జిల్లా కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, రేవోజు స్వామి, సంధ్యారాణి ఉన్నారు.

నాగార్జున డెయిరీని సందర్శించిన గురుకుల విద్యార్థులు

నాగార్జున సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద గురుకుల విద్యార్థులు

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 30: బోర్నపల్లి గ్రామ శివారులో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు సోమవారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని పరకాల క్రాస్ వద్ద గల నాగార్జున డెయిరీ ఫాం, నాగార్జున సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బంది డెయిరీ, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ పనితీరును విద్యార్థులకు వివరించారు. మెషినరీపై విద్యార్థులకు కలిగిన అనుమానాలను నివృత్తి చేశారు. విద్యార్థి దశలోనే ఇండస్ట్రీలపై అవగాహన కల్పించడం వారి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని, విద్యార్థులు తమ ప్లాంట్‌ను సందర్శించేలా కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ సంపత్‌కు నాగార్జున డెయిరీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అకినపల్లి ప్రవీణ్, నాగార్జున డెయిరీ డైరెక్టర్ పీ గణేశ్ రావు, ఏజీఎం సుధాకర్, మేనేజర్ బీ శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గోడు వినండి.. గోస తీర్చండి

- ప్రజావాణిలో 240 దరఖాస్తులు
- పరిష్కరించాలంటూ ఆయా శాఖల హెచ్‌వోడీలకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రజావాణిలో అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా సమస్యలకు పరిష్కారం లభించలేదంటూ కొందరు వాపోయారు. తమ ఇబ్బందులు తీర్చాలంటూ వేడుకున్నారు. వారి సమస్యలను విన్న కలెక్టర్, సంబంధిత దరఖాస్తులు స్వీకరించి, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులకు అప్పగించారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 240 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

-కలెక్టరేట్, డిసెంబర్ 30

నల్లా కనెక్షన్ కోసం లంచం కావాలట

మిషన్ భగీరథ పథకం ద్వారా మా ఊర్ల ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చిన్రు. కానీ, నా ఇంటికి మాత్రం ఇవ్వలేదు. దీనిపై నేను గ్రామ కార్యదర్శిని అడిగితే మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌ను అడగాలంటూ, సూచించింది. నేను వెళ్లి అడిగితే రూ.5వేలు ఇస్తే పైప్‌లైన్ వేయిస్తా. అట్లాగే, నీ ఇంటికి సీసీ రోడ్డు కూడా వేయిస్తా. ఇవ్వకుంటే ఈ రెండు నీకు రావు అంటూ చెప్పిండు. ఊరిలో మాకన్నా మూలల్లో ఉన్న ఇళ్లకు కూడా భగీరథ లైన్లు వేశారు. సీసీ రోడ్డు వేశారు. ఎంపీడీవో కార్యాలయంలో, గ్రామపంచాయతీలో చాలాసార్లు దరఖాస్తులు అందించిన. అయినా, నాకు మాత్రం నల్లా కనెక్షన్ ఇప్పించలేదు. న్యాయం చేయాలని ప్రజావాణికి వచ్చిన. కలెక్టర్‌ను కలిసి దరఖాస్తు ఇచ్చిన.

-గడ్డం రాజిరెడ్డి, పీచుపల్లి, చిగురుమామిడి మండలం

'స్వాహా చేసిన నిధులు కక్కించాలి'

ప్లకార్డు ప్రదర్శిస్తున్న మాజీ సర్పంచ్ స్వామి

గ్రామపంచాయతీలో నిధులు స్వాహా చేసిన మాజీ గ్రామ ఉపసర్పంచ్, పంచాయతీ సిబ్బంది నుంచి వెంటనే ఆమొత్తం వసూలు చేయాలంటూ జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మారపల్లి స్వామి సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డు ప్రదర్శిస్తూ, బైఠాయించాడు. పంచాయతీ నిధుల నుంచి అప్పటి ఉపసర్పంచ్, అధికారులు కుమ్మక్కై రూ.3,66,566 పక్కదారి పట్టించారని ఆరోపించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసి అన్యాయంగా సస్పెండ్ చేయించారని, దీనిపై విచారణ జరిపించాలని కోరినా స్పందన లేదని, వెంటనే అధికారులు విచారణ జరిపి స్వాహా చేసిన నిధులు తిరిగి వసూలు చేయాలంటూ గంటకు పైగా కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపాడు.

మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలి

మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ కోసం దరఖాస్తు చేసుకున్న. కలెక్టరమ్మ కనికరించి ఇప్పించాలి. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం మాది. నాభార్యతో పాటు నేను చిన్నా, చితక పనులు చేస్తేనే పూట గడుస్తది. ఈపరిస్థితుల్లో కరాబైన సైకిల్‌పై నేను టౌన్‌లో తిరగడం ఇబ్బందిగా మారింది. కరుణించి, ప్రభుత్వం ద్వారా నాకు బ్యాటరీ ట్రైసైకిల్ ఇప్పించాలి.

-మేకల చలం, దివ్యాంగుడు (విజయపురి కాలనీ, కరీంనగర్)

కోడలు ఇంట్లు నుంచి వెళ్లగొట్టింది

వృద్ధాప్యంలో ఉన్న నన్ను ఆదరించకుండా నా కోడలు ఇంట్లు నుంచి వెళ్లగొట్టింది. కొడుకు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. 89 ఏండ్లున్న నేను కాళ్లనొప్పులతో నడువలేకపోతున్న. నాలుగు రోజులుగా వీధుల్లో తిరుగుతూ అడుక్కు తింటున్నా. నిన్న కూడా ఇంటికి వెళ్తే నాముందే తలుపులేసుకున్నది. అరుగుపైనే పడుకున్న. కలెక్టరమ్మ దగ్గరికి పోతే న్యాయం జరుగుతదంటే వచ్చిన.

-ఇండ్ల లక్ష్మి (సుభాష్‌నగర్, కరీంనగర్)

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 30 : 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూడో బాల బాలికల సబ్ జూనియర్స్ చాంపియన్‌గా కరీంనగర్, కేడెట్ చాంపియన్‌గా ఆదిలాబాద్ జిల్లాలు నిలిచాయి. రెండు రోజులుగా తెలంగాణ, జిల్లా జూడో సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగిన 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, కేడెట్ బాలబాలికల జూడో పోటీలు సోమవారంతో ముగిశాయి. రెండు విభాగాల్లో జరిగిన పోటీలకు తెలంగాణ వ్యాప్తంగా 20 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు 100 మంది కోచ్, మేనేజర్, రెఫరీలు హాజరయ్యారు. పోటీల్లో భాగంగా సబ్ జూనియర్స్, కేడెట్ విభాగాల్లో మహబూబ్‌నగర్ జిల్లా ద్వితీయ చాంపియన్‌గా నిలువగా, సబ్ జూనియర్స్ విభాగంలో ఆదిలాబాద్, కేడెట్ విభాగంలో కరీంనగర్ జిల్లాలు తృతీయ చాంపియన్‌గా నిలిచాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులను తెలంగాణ జట్లకు ఎంపిక చేశామని, జనవరి 18 నుంచి 21 వరకు సబ్ జూనియర్స్, 22 నుంచి 25 వరకు కేడెట్ జాతీయ స్థాయి జూడో పోటీలు పూణెలోని ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగనున్నట్లు తెలంగాణ జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జూడో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి బండిని కలిసిన వీసీ

బండి సంజయ్‌తో మాట్లాడుతున్న వీసీ ఉమేశ్ కుమార్

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 30 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సోమవారం కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యూ ఉమేశ్ కుమార్ కలిశారు. విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం, ఆడిటోరియం ఆధునీకరణ కోసం రూ.50 లక్షలు, విశ్వవిద్యాలయంలో క్రీడామైదానం అభివృద్ధిలో భాగంగా సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేయాలని, విశ్వవిద్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న లా కళాశాల కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు స్థానిక పార్లమెంట్ సభ్యుడిగా సిఫారసు చేయాలని కోరినట్లు వీసీ వెల్లడించారు. ఇందుకు బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇక్కడ వీసీతో విశ్వవిద్యాలయ సిబ్బంది ఉన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన బ్రిడ్జి జేఏసీ నాయకులు

గన్నేరువరం, డిసెంబర్30: మండలానికి చెందిన బ్రిడ్జి జేఏసీ నాయకులు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో కలిశారు. గన్నేరువరం నుంచి జిల్లా కేంద్రానికి మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బండి సంజయ్ ఇటీవల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రభుత్వానికి నిరసన గళం వినిపించేందుకే ఎమ్మెల్సీగా పోటీ'

మేచినేని నవీన్‌రావు

గంగాధర, డిసెంబర్ 30 : సర్పంచులుగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మాజీ సర్పంచుల జేఏసీ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గంగాధర మండలం కురిక్యాల మాజీ సర్పంచ్ మేచినేని నవీన్‌రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. సర్పంచులుగా అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, అప్పులకు వడ్డీలు పెరిగిపోయి ఇబ్బదులు పడుతున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని జేఏసీ ఆధ్వర్యంలో కొంతకాలంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. బిల్లుల సాధన కోసం రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను అవకాశంగా తీసుకోవాలని, మాజీ సర్పంచుల జేఏసీ తరపున ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా తమ నిరసన గళాన్ని బలంగా వినిపిస్తామని నవీన్‌రావు పేర్కొన్నారు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో దిగుతున్న నవీన్‌రావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

జ్యోతినగర్ వేంకటేశ్వరాలయ నూతన పాలక మండలి

కలెక్టరేట్, డిసెంబర్ 30: నగరంలోని జ్యోతినగర్‌లో గల శ్రీమహాలక్ష్మీ గోదాదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలిని సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా దేశ వేదం, ఉపాధ్యక్షులుగా గడ్డం లింగన్నగౌడ్, పి.అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రాంచందర్‌రావు, సహాయ కార్యదర్శులుగా దేశ రఘుకుమార్, పి.వెంకట్రాములు, నిర్వహణ కార్యదర్శిగా జి.పరంధాములు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, న్యాయసలహాదారుగా చక్రరాజ్ సుధీర్‌కుమార్ నియమితులైనట్లు ప్రధాన కార్యదర్శి ఆర్.రాంచంద్రారావు ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి అబాకస్ గణిత పోటీలకు వోవెల్స్ పాఠశాల విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 30 : విశ్వం ఎడ్యుటెక్ సంస్థ అబాకస్ జోనల్ స్థాయి పోటీలను ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించగా, జిల్లాకు చెందిన సుమారు 70 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వోవెల్స్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. పాఠశాలకు చెందిన జె. రితిక్ రెడ్డి, ఎన్. అశ్విన్ రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు విశ్వం ఎడ్యుటెక్ సంస్థ నిర్వాహకులు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందించారు.

'విన్నర్స్' విద్యార్థుల సత్తా

రామడుగు, డిసెంబర్ 30: మండల కేంద్రంలోని విన్నర్స్ విద్యాలయానికి చెందిన విద్యార్థి కచ్చు రిషిత్ జిల్లా కేంద్రంలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్ తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయిలో సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగా అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ప్రతిభను చూపిన విద్యార్థులను జగన్‌మోహన్‌గౌడ్ అభినందించారు.

సరస్వతీ పాఠశాల విద్యార్థులకు అభినందన

గంగాధర, డిసెంబర్ 30 : విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ లెవల్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో మండలంలోని గర్శకుర్తి సరస్వతీ పాఠశాల విద్యార్థి మిట్టపెల్లి సాందీప్ కృష్ణ జిల్లా స్థాయిలో చాంపియన్ ట్రోఫీని గెలుచుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కరస్పాండెంట్ మిట్టపెల్లి రాజశేఖర్ తెలిపారు. అలాగే, కొండబత్తిని రితేశ్ కన్సోలేషన్ బహుమతిని గెలుచుకున్నాడని చెప్పారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా 'వాయిస్ ఆఫ్ కాకతీయ'

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జమ్మికుంట, డిసెంబర్ 30: పట్టణంలోని కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ అవిర్నేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీఆర్ గార్డెన్‌లో మున్సిపల్ పరిధిలోని గణేశ్‌నగర్‌లో గల శ్రీ కాకతీయ హైస్కూల్(సీబీఎస్ఈ)విద్యార్థులతో 'వాయిస్ ఆఫ్ కాకతీయ'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైఫ్ కోచ్ అండ్ మోటివేటర్ ఎంవీఎన్ కశ్యప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ఇష్టంగా చదువుకోవాలని సూచించారు. భయం లేకుండా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కాకతీయ విద్యార్థుల క్రమశిక్షణ, భాష, తదితర అంశాలను కొనియాడారు. లైఫ్ కోచ్ అండ్ మోటివేషన్‌పై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామని పాఠశాల చైర్మన్ సుధాకర్‌రావు తెలిపారు. అంతకు ముందు వాయిస్ ఆఫ్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆట, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్, తదితరులున్నారు.

ఓపెన్‌మైండ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌రూరల్, డిసెంబర్ 30: జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి పతకాలు గెలుచుకున్నారు. విధార్థ్ (అండర్5-7), మరియం భాను(7-9) స్వర్ణ పతకాలు, మయాంక్ (9-11) కాంస్యం, శ్రీహంసి (9-11) స్వర్ణంతో పాటు బాల రత్న అవార్డు అందుకుంది. శ్రీహస్ (11-14) 2 స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, పట్టుదల, కోచ్‌ల మార్గదర్శకత్వానికి ఈ పతకాలు ప్రతిఫలమన్నారు. కార్యక్రమంలో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, స్కేటింగ్ కోచ్ జీవన్, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం జిల్లా నూతన కార్యవర్గం

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 30: పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం సగర సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దేవునూరి శ్రీనివాస్ సగర, ప్రధాన కార్యదర్శిగా కట్టరాజు సగర, కోశాధికారిగా కాటిపెల్లి కుమారస్వామి సగర గెలుపొందారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికిషన్, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర, ఉపాధ్యక్షుడు నలుబాల భిక్షపతి సగర, కార్యనిర్వాహణ కార్యదర్శి కానిగంటి శ్రీనివాస్ సగర, మహిళా విభాగం అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర, యువజన విభాగం అధ్యక్షుడు మర్క సురేశ్, ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్ సగర, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమళ్ల కుమారస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు బొడిపెల్లి కొటేశ్వర్ సగర, కుర్మిండ్ల రాజు సగర, నలుబాల మధు సగర పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఈఎస్ఐ దవాఖాన ఏర్పాటు చేయాలి

విద్యానగర్, డిసెంబర్ 30: కరీంనగర్‌లో ఈఎస్ఐ దవాఖాన ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు సోమవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేశ్, జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, నక్క అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 30: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, జిల్లా నాయకులు జగదీశ్, మల్లారెడ్డి, మల్లేశం, రవి, కాల్వ సంపత్, రాజేశం పాల్గొన్నారు.

రేకుర్తి కంటి దవాఖానలో నగదురహిత సేవలు

విద్యానగర్, డిసెంబర్ 30: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో జనవరి 1 నుంచి కాట్రాక్ట్ ఆపరేషన్లు, కంటికి సంబంధించిన పలు వ్యాధులకు నగదు రహిత సేవలు అందుబాటులోకి రానున్నట్లు హాస్పిటల్ చైర్మన్ కొండా వేణుమూర్తి తెలిపారు. పేషెంట్స్, వివిధ రకాల ఇన్సూరెన్స్ సదుపాయం ఉన్నవారు ఆపరేషన్ చేయించుకునే ముందు రోజు కానీ, అదే రోజు కాని ఉదయం 9గంటలకు దవాఖాన సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. రెటీనా, గ్లకోమా సేవలకు ఈ క్యాష్‌లెస్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో సూచించారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

గంగాధర, డిసెంబర్ 30 : సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మండల దళిత సంఘం నాయకులు కోరారు. సోమవారం మండలంలోని మధురానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ, సింహగర్జన పేరుతో కొంతమంది ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. ఇక్కడ నాయకులు న్యాతరి శివ